# దివ్యాంగులకు ఆత్మగౌరవం

- సీఎం కేసీఆర్ పాలనలో సంక్షేమం ● ₹4,016 పింఛన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణే
- బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి ● చల్మెడను భారీ మెజార్టీతో గెలిపించాలి
- దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి ● అభివృద్ధిని చూసి కేంద్రమే ప్రశంసించింది
- వేములవాడలో దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్
- ఆశీర్వదించండి.. రుణపడి ఉంటా : బీఆర్ఎస్ అభ్యర్థి లక్ష్మీనరసింహారావు



దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనంలో బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు, దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవారెడ్డికి రాజన్న ప్రసాదం అందజేస్తున్న దివ్యాంగురాలు

వేములవాడ, అక్టోబర్ 31: సీఎం కేసీఆర్ పాలనలో దివ్యాంగులు ఆత్మగౌరవంతో బతుకుతున్నారని రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవారెడ్డి స్పష్టం చేశారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ₹4,016 పింఛన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణేనని స్పష్టం చేశారు. వేములవాడ పట్టణంలోని రాజశ్రీ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం నిర్వహించిన దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో ₹500 మాత్రమే ఉన్న పింఛన్‌ను, సీఎం కేసీఆర్ దశలవారీగా పెంచి ప్రస్తుతం ₹4,016 అందిస్తున్నారని కొనియాడారు. గడిచిన తొమ్మిదిన్నర ఏండ్లల్లో దివ్యాంగుల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ₹10,300కోట్లు కేటాయించిందని తెలిపారు. సబ్బండవర్గాల అభివృద్ధే లక్ష్యంగా సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. గతంలో వాహనాలకు 30 శాతం మాత్రమే సబ్సిడీ ఉండేదని, ప్రస్తుతం వందశాతం అందిస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ₹200 పెన్షన్ మాత్రమే ఇస్తున్నారని మండిపడ్డారు. రైతుబంధు, నిరంతర కరెంట్ అవసరమా..? కరెంట్ వద్దన్న కాంగ్రెస్ కావాలా..? అని ఆలోచించాలని సూచించారు. కారు గుర్తుకు ఓటేసి వేములవాడ బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడలక్ష్మీ నరసింహారావును భారీ మెజార్టీతో గెలిపించుకుందామని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ బండ నర్సయ్య యాదవ్, ఎంపీపీలు బండ మల్లేశం, బైరగోని లావణ్య, చంద్రయ్యగౌడ్, జడ్పీటీసీ మ్యాకల రవి, సెస్ డైరెక్టర్లు హరిచరణ్‌రావు, ఆకుల దేవరాజు, ఏఎంసీ వైస్ చైర్మన్ బాల్‌రెడ్డి, పార్టీ అధ్యక్షులు పుల్కం రాజు, గోస్కుల రవి, మల్యాల దేవయ్య, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షులు రాంరెడ్డి, ఏశ తిరుపతి, కమలాకర్‌రావు, కౌన్సిలర్లు, సర్పంచులు ఎంపీటీసీలు, నాయకులు రాఘవరెడ్డి, గడ్డం హన్మాండ్లు, రామతీర్థపు రాజు, తదితరులు పాల్గొన్నారు.

### రుణం తీర్చుకుంటం



బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దివ్యాంగులు ఆత్మగౌరవంతో ఉన్నరు. గతంలో ₹500 వచ్చే పింఛన్ కోసం నానాతంటాలు పడేటోళ్లం. ఈ రోజు ₹4,016 ఇచ్చి మమ్మల్ని ఆదుకుంటున్నడు. కారు గుర్తుకు ఓటేస్తాం. కేసీఆర్ సారు రుణం తీర్చుకుంటం.

*- మరాటి తిరుపతి, దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు*



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవారెడ్డి, పక్కన ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు

### అభివృద్ధిని చూసి కేంద్రమే ప్రశంసించింది

దేశంలో ఏ రాష్ట్రంలో కూడా జరగనంత అభివృద్ధి తెలంగాణలో అద్భుతంగా జరుగుతున్నది. ఇది కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్ పలు సందర్భాల్లో ప్రశంసించి, అవార్డులు అందించింది. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నీతిఅయోగ్ గుర్తించి రివార్డులు కూడా ఇచ్చింది. రాజకీయ విమర్శలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వంపై కేంద్ర మంత్రులు ఆరోపణలు చేస్తున్నరు. ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నరు. రాష్ట్రంలో ఐదు లక్షల 69వేల712 మందికి పింఛన్ ఇవ్వడమే కేసీఆర్ పాలనకు నిదర్శనం. దివ్యాంగులకు ₹4,016 పింఛన్ ఇస్తున్నాం. రానున్న రోజుల్లో దశల వారీగా ₹6,016 అందిస్తాం. కాంగ్రెస్, బీజేపీ నాయకులు చేసే మోసపూరిత హామీలు నమ్మవద్దు.

*- వినోద్‌కుమార్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు*

### ఆశీర్వదించండి.. రుణపడి ఉంటా

కాంగ్రెస్, బీజేపీ నాయకులకు ప్రజలపై చిత్తశుద్ధి లేదు. బీజేపీ పాలిత రాష్ట్రాలైన మహారాష్ట్రలో ₹300, ఉత్తరప్రదేశ్‌లో ₹400మాత్రమే దివ్యాంగులకు పింఛన్‌గా ఇస్తున్నరు. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ మాత్రమే ₹4,016 ఇచ్చి దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం నింపుతున్నరు. అలాగే డబుల్‌బెడ్రూం ఇండ్లలో ఐదుశాతం రిజర్వేషన్ కల్పిస్తున్నరు. పూర్తి సబ్సిడీపై వాహనాలు ఇస్తున్నాం. నన్ను ఎమ్మెల్యేగా ఆశీర్వదించండి. మీకు రుణపడి ఉంటా. అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తా.

*- చల్మెడ లక్ష్మీనరసింహారావు, బీఆర్ఎస్ అభ్యర్థి*



వేములవాడలోని రాజశ్రీ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన నియోజకవర్గంలోని దివ్యాంగులు

## మీ ఓటు రైతుబంధుకా..
# రాబందులకా..?

- కాంగ్రెస్ వస్తే సంక్షోభమే
- కరెంట్ కష్టాలతో కర్ణాటక కటకట
- కాంగ్రెస్, బీజేపీ కల్లబొల్లి మాటలు నమ్మవద్దు
- కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష
- అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఆదరించండి
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సుంకె రవిశంకర్
- చొప్పదండి మండలంలో ఎన్నికల ప్రచారం



భూపాలపట్నంలో వృద్ధురాలని ఆపాయ్యంగా పలుకరిస్తూ కారు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్

చొప్పదండి, అక్టోబర్ 31: 'అరవై ఏండ్ల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీలేదు. ఆ పార్టీ మరోసారి అధికారంలోకి వస్తే రాష్ట్రంలో సంక్షోభం, అంధకారమే మిగులుతుంది. కర్ణాటక లెక్క కరెంట్‌కు గోసపడాల్సిందే. టార్చ్‌లైట్ పట్టుకొనే పొలాల దగ్గరికి వెళ్లి కరెంటు పెట్టుకొని, అక్కడే పండుకుని పరిస్థితి మళ్లీ వస్తుంది. ప్రజలారా మీ ఓటు రైతుబంధువు వేస్తారో..? లేదా రాబంధువులకు వేస్తారో..? ఒక ఆలోచించండి. కాంగ్రెస్, బీజేపీ కల్లబొల్లి మాటలు నమ్మకండి. కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష' అని బీఆర్ఎస్ చొప్పదండి అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ స్పష్టం చేశారు. ఎన్నికల ముందు వచ్చి తర్వాత వెళ్లిపోయే నాయకులకు ఈ ప్రాంతం మీద మమకారం ఉండదని విమర్శించారు. తాను స్థానికుడనని, అందరికీ అందుబాటులో ఉంటున్నాని, ఏ ఆపద వచ్చినా అండగా నిలుస్తున్నానని చెప్పారు. స్థానిక బిడ్డగా తనకు మరోసారి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. చొప్పదండి మండలం భూపాలపట్నం, వెదురుగట్ట, కొలిమికుంట, చాకుంట గ్రామాల్లో మంగళవారం ఆయన ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయాచోట్ల మాట్లాడారు. తెలంగాణ అభివృద్ధిని చూసి కాంగ్రెస్, బీజేపీ వాళ్ల కండ్లు మండుతున్నాయని విమర్శించారు. బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టో అన్నివర్గాల ప్రజలకు మేలు చేసేలా ఉందన్నారు. వ్యవసాయానికి 24గంటల కరెంటు ఇవ్వడం లేదని విమర్శిస్తున్న కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఇక్కడికొచ్చి కరెంటు తీగలు పట్టుకొని చూడాలని సవాల్ విసిరారు. మూడు గంటలు కరెంట్ చాలని రేవంత్‌రెడ్డి, రైతుబంధు వద్దని ఉత్తంకుమార్‌రెడ్డి అంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ వస్తే రైతుబంధు, నిరంత విద్యుత రెండు బంద్ అవుతాయని, ప్రజలు ఆలోచన చేసి ఓటేయాలని కోరారు. కేసీఆర్ అంటే నిజం.. మోడీ అంటే అబద్ధం అని విషయాన్ని ప్రజలు తెలుసుకోవాలన్నారు. గతంలో ఇక్కడ ఎమ్మెల్యేలుగా గెలిచిన వారంతా స్థానికేతరులని, వాళ్లు అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు. తాను లోకల్ అని, అభివృద్ధే తన లక్ష్యమని స్పష్టం చేశారు. నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలిపానని, పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలను అందిస్తున్నాని చెప్పారు. కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా సుంకె రవిశంకర్‌కు జడ్పీటీసీ మాచర్ల సౌజన్య, మహిళా సర్పంచులు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఒగ్గుడోలు కళాకారులు, డప్పుచప్పుళ్లతో గ్రామాల్లో భారీ ర్యాలీ తీశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి, ఎంపీపీ చిలుక రవీందర్, జడ్పీటీసీ మాచర్ల సౌజన్య–వినయ్ తదితరులు పాల్గొన్నారు.

- ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయాన్ని అందించాలి ● మానకొండూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ విజ్ఞప్తి ● మానకొండూర్ మండలంలో ప్రచారం

# మీ ఆశీర్వాదమే నాకు అండ



అన్నారంలో పార్టీలో చేరిన యువకులకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే, జీవీఆర్

మానకొండూర్ రూరల్, అక్టోబర్ 31: 'మీ ఆశీర్వాదమే తనకు కొండంత అండ. ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి హ్యాట్రిక్ విజయాన్ని అందించాలి' అని ప్రజలకు బీఆర్ఎస్ మానకొండూర్ అభ్యర్థి, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ విజ్ఞప్తి చేశారు. ముందుగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి మంగళవారం మానకొండూర్ మండలం అన్నారం హనుమాన్ ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేసి, ప్రచారం చేశారు. ఆ తర్వాత అన్నారంతోపాటు లలితాపూర్, దేవంపల్లి గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయాచోట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి రసమయి మాట్లాడారు. పదేండ్లలో సీఎం కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమం కోసం అనేక పథకాలు తీసుకువచ్చారని గుర్తు చేశారు. మరోసారి బీఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టాలని ప్రజలను కోరారు. ఎన్నికల తర్వాత రూ.400కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని చెప్పారు. కాంగ్రెస్ నాయకులు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతోనే బతుకమ్మ చీరల పంపిణీ, రైతుబంధు పథకాన్ని ఆపాల్సి వచ్చిందన్నారు. దీనిపై ఓట్లకోసం వచ్చే కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని ప్రజలకు సూచించారు. జీవీ రామకృష్ణారావు మాట్లాడుతూ, మానకొండూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌దేనన్నారు. ప్రతి ఒక్కరూ కారు గుర్తుకు ఓటు వేసి ఆయనకు హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని కోరారు. అన్నారంలో దాదాపు 50 మంది యువకులకు బీఆర్ఎస్‌లో చేరగా, గులాబీ కండువాలు కప్పి వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఆయా గ్రామాల్లో ప్రచారానికి వచ్చిన రసమయి బాలకిషన్‌కు మహిళలు బతుకమ్మలతో ఘనంగా స్వాగతం పలికారు. దారి పొడవునా పూలు చల్లుతూ అభిమానాన్ని చాటుకున్నారు.